నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,30 సెప్టెంబర్ 2024

ప్రభుత్వ మోడ్రన్ డిగ్రీ కాలేజీకి 50 లక్షలు కేంద్ర ప్రభుత్వ నిధులుతో అభివృద్ధి

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మేజర్న్యూస్ : స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ నెల రోజుల క్రితం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ను కలవడం ఆయన కేంద్ర సహకారంతో మోడల్ డిగ్రీ కాలేజీ ల్యాబ్ కు మరియు వాటికి అవసరమైన పరికరాల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ఎస్ పిఎంసిఎల్ నిధులు కేటాయించాలని కోరడం వెంటనే నిధులు రావడం జరిగిందని పనిచేసే నాయకుడు జ్యోతుల నెహ్రూ లాంటి వ్యక్తికి అన్ని విధాల సహకరిస్తామని తెలియజేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కాలేజీకి కోరిన వెంటనే కేంద్ర ప్రభుత్వ నిధులు సమకూర్చిన రామ్‌కుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని గత 2019 నుండి 24 వరకు కాలేజీ గత పాలకులు వల్ల ఏ విధమైన అభివృద్ధికి నోచుకోలేదని ఈరోజు కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర మంత్రి లోకేష్ ను కూడా 35 లక్షల రూపాయలు కోరడం ఆయన వెంటనే స్పందించి నిధులు కేటాయించడం జరిగిందని పనిచేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అనడానికి ఇదే నిదర్శనం అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు బిజెపి ఇన్చార్జ్ దాట్ల కృష్ణ వర్మ, జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు కామినేని జయ శ్రీ, దాసరి తమ్మన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

30% మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

- ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు లంకలపల్లి సాయి శ్రీనివాస్ డిమాండ్

అమలాపురం,మేజర్న్యూస్ : ఎస్‌టియు డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం ఎస్‌టియు విద్యా భవన్, అమలాపురం నందు జిల్లా అధ్యక్షులు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్టియు అధ్యక్షులు లంకలపల్లి సాయి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం నాయకులు సీతారాం ఏచూరి, చెరుకూరి రామోజీరావు లకు, వివిధ సంఘటనలలో మృతి చెందినవారికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు సంఘ కార్యకలాపాలన నివేదికను, ఉపాధ్యాయులకు చేస్తున్న సేవలను నివేదిక రూపంలో ప్రవేశపెట్టారు. ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ సమావేశంలో ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు.

అభయ్ కన్వీనర్ ఆర్.ఆర్.కె. ప్రసాద్ ఎస్‌టియు అభయ్ నివేదికను ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయవాణి కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు ఉపాధ్యాయ వాణి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు లంకలపల్లి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ 12వ పిఆర్సి ప్రకటన ఇప్పటికే ఆలస్యం అయినందున తక్షణమే 30% మధ్యంతర భృతిని రాష్ట్రంలోని ఉద్యోగ,ఉపాధ్యాయులకు ప్రకటించాలని

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, సిపిఎస్ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న డిఎ ఏరియర్ చెల్లించాలని, 2022 నుండి పెండింగులోనున్న సరెండర్ లీవ్ బిల్లులు వెంటనే చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని లేనియెడల ఉద్యమ కార్యాచరణ ప్రకటించవలసి వస్తుందని తెలియజేశారు. ఈ సమావేశంలో పి.గన్నవరం మండలంలో ఎంపీపీ స్కూల్ కుందాలపల్లి నందు పనిచేస్తూ ఆకస్మికంగా మరణించిన గోరుగంతు శ్రీనివాస సాంబ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు ఎస్టియు అభయ్ స్కీమ్ ద్వారా రూ.2,00,000ల చెక్ ఇవ్వడం జరిగింది. అలాగే అన్ని నివేదికలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.పల్లం రాజు, ఆర్థిక కార్యదర్శిఎన్.సత్యనారాయణ,అభయ్‌కన్వీనర్ ఆర్.ఆర్.కె. ప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చొప్పలరాంబాబు,చిక్కం మైనర్‌బాబు,వెలిగట్ల రత్న కుమారి, ఉమాపతి శాస్త్రి, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, నల్లి ప్రసాద్, నరహరశెట్టి సత్యనారాయణ,మట్ట నాగరాజు, పి.వెంకటేశ్వరరాజు, నిమ్మన సత్యనారాయణ, కుంచే సిద్ధార్థ ప్రసాద్, వంగా అయ్యప్ప కుమార్, కొమ్ముల సత్య రమేష్, కుడిపూడి హేమంత్ శివకుమార్, వేమన వి.వి. సత్యనారాయణ, ఎం. లక్ష్మణ్ కుమార్, గెద్దాడ రాధాకృష్ణ, జి.రాజశేఖర్, మునగాల భవాని, కడలి రంజిత్ కుమార్, నందెపు శ్రీనివాస్, బాలబసవేశ్వరరావు, బాలనాగు గుప్తా, పి.గన్నవరం మండల శాఖ అధ్యక్షులు నల్లా బాలాజీ, ప్రధాన కార్యదర్శి బల్ల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి నీతిపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ బి.వి.చౌదరి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పోల్నాటి నాగ ప్రసాదు, జిల్లా ఫైనాన్స్ కమిటీ మెంబర్ కే.గోపాలకృష్ణ, జిల్లా కౌన్సిలర్ రాణి శేషగిరిరావు, కే.వీ. లక్ష్మణరావు, చిక్కం రవికుమార్, ఇతరజిల్లా,రాష్ట్ర, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- ఇఇ ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్

పెద్దాపురం రూరల్, మేజర్న్యూస్ : పెద్దాపురం మండల పరిధిలో మర్లావ ఫీడర్ 11 కెవి ఆర్.డి.ఎస్.ఎస్. పని కారణంగా నేడు, అక్టోబర్ 1వ తేదిన రెండు రోజుల పాటు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మర్లావ, తూర్పుపాకలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని, పెద్దాపురం ఎలక్ట్రికల్ ఇఇ (ఆపరేషన్స్) ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ

- ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం,మేజర్న్యూస్ : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ జరుగుతుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆమె తెలిపారు.

సెప్టెంబరు 30 సోమవారం "పీజీఆర్ఎస్ ప్రజల అర్జీల పరిష్కార వేదిక 'మీ కోసం"

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,మేజర్ న్యూస్ : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజలనుంచి అర్జీలను స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ సెప్టెంబరు 30వ తేదీన చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. సెప్టెంబరు 30 సోమవారం "పి జి ఆర్ ఎస్ - మీ కోసం" ద్వారా ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, రెవెన్యు డివిజనల్ ,మునిసిపల్, మండల స్థాయిలో "మీ కోసం" కార్యక్రమం యధా విధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, మీ మీ అర్జీలని క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండే డివిజనల్ , మునిసిపల్, మండల స్థాయి అధికారులకి అందచేయాలని కోరారు. అర్జి దారులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కలెక్టరేట్ వద్ద కు రావద్దని కలెక్టరు ప్రశాంతి తెలియ చేశారు. రెవిన్యూ డివిజనల్ అధికారులకి, మునిసిపల్ కమిషనర్లకు, తహసిల్దార్, ఎంపిడివో ఇతర మండల స్థాయి అధికారులకి అందచేయాలని ఆ ప్రకటనలో తెలియ చేశారు.

డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి జగన్మోహన్ రెడ్డి ఎందుకు ఇబ్బంది పడుతున్నారు..?

- బీజేపి కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు

కొవ్వూరు, మేజర్ న్యూస్ : డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి జగన్మోహన్ రెడ్డి ఎందుకు ఇబ్బంది పడుతున్నారని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు సూటిగా ప్రశ్నించారు. ఆదివారం కొవ్వూరు గోష్పాద క్షేత్రం లో ఉన్న సుందర గోవింధుని ఆలయంలో తిరుమల శ్రీ వారి లడ్డు అపవిత్రత పై భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ అధ్యర్యంలో జరిగిన గోవు గోష వినండి గోవిందా అనే కార్యక్రమం సందర్భంగా జరిగిన గోవు పూజ కార్యక్రమంలో సోము వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ హిందుత్వం అనేది జీవన విధానంగా చూస్తామని అన్నారు. హిందుత్వంలో నిబంధనలు లేకపోవడంతో వేరే మతాలకు వెళ్తున్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి డిక్లరేషన్‌లో సంతకం పెట్టి తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్ళడానికి వచ్చిన ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. అసలు 320 రూపాయలనకు ఆవునెయ్యి వస్తుందా? నెయ్యి కల్తీ జరిగిందా లేదా? అనే అంశాలపై చర్చ జరగాలని అన్నారు. 6 వేల కోట్ల బడ్జెట్లో నెయ్యికి 600 కోట్లు ఖర్చుపెట్టడానికి జగన్ ఎందుకు ఆలోచించారని అన్నారు. ఈ విషయాలపై శోధించి,చర్చించాలని సోము వీర్రాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, బిజెపి నాయకులు పిల్లలమర్రి మురళి కృష్ణ,పిక్కి నాగేంద్ర, జి.పవన్, టి.ఎన్ వి.రమణ మూర్తి, టి.విజయవాణి, రామచంద్ర రావు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాత్మా విగ్రహాన్ని ఆధునికరించండి

- పగుళ్లు వచ్చి పెచ్చులుగా ఊడిపోతున్నా వైనం

- శిథిలావస్థకు చేరిన మరమ్మత్తులకు నోచుకొని విగ్రహం

కొత్తపేట,మేజర్న్యూస్ : భారత స్వాతంత్ర్యపోరాటంలో ముఖ్య భూమిక పోషించిన జాతిపిత విగ్రహాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.స్థానిక బాయ్స్ హై స్కూల్‌లో 2003 గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేశారు.కానీ ఆ విగ్రహం నేడుశిథిలావస్థకు చేరుకుంది. గాంధీ జయంతి రావడంతో విగ్రహా నికి రంగులు మాత్రమే వేసి,పగుళ్లు ఏర్పడి పెచ్చులు ఊడిపోతున్న కనీసం ఆ విగ్రహానికి మరమ్మతులు చేస్తే బాగుండేదన్న వాదన విద్యార్థుల తల్లిదండ్రులు,స్థానికుల్లో వినిపిస్తోంది.శిథిలావస్థకు చేరుకుంటున్న ఆ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ ఆ విగ్రహం వైపు కన్నెత్తి చూసిన దాఖలు లేవంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోరాట యోధుల విగ్రహాలను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

గొల్లప్రోలులో వికలాంగుల ప్రాయశ్చిత్త దీక్ష

సంఘీభావం తెలిపిన జనసేన పార్టీ నాయకులు

గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : గొల్లప్రోలు పట్టణము మెయిన్ రోడ్ పాత బస్టాండ్ శ్రీవారి ఆలయం వద్ద ఆదివారం ఉదయం వికలాంగుల సంక్షేమం సంఘం సభ్యులు ఉలవ శెట్టి శ్రీను ఆధ్వర్యంలో సీనియర్ జనసేన పార్టీ నాయకులు బస్సా చిట్టిబాబు, కడారి తమ్మయ్య నాయుడు అధ్యక్షతన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశిక్ష దీక్షకు మద్దతుగా వికలాంగుల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఉదయం 8 గంటల నుండి ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించారు. అంతకుముందు తెల్లవారుజామున గొల్లప్రోలు శ్రీవారి సన్నిధిలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశిక్ష దీక్షకు శ్రీ వెంకటేశ్వర స్వామి పిఠాపురం శాసనసభ్యులు పవన్ కళ్యాణ్‌కి సంకల్ప సిద్ధి మనోబలాన్ని ప్రసాదించాలని బస్సా చిట్టిబాబు, కడారి తమ్మయ్య నాయుడు, మామిడాల సూరిబాబు ప్రత్యేక పూజ కార్యక్రమాలు గొల్లప్రోలు శ్రీవారి సన్నిధిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం దీక్షా శిబిరానికి పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జి మరి రెడ్డి శ్రీనివాసు చేరుకుని ప్రాయశిక్షణ దీక్ష చేపట్టిన వికలాంగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాధురి విద్యాలయాల అధినేత కడారి తమ్మయ్య నాయుడు, సీనియర్ జనసేన పార్టీ నాయకుడు బస్సా చిట్టిబాబు మాట్లాడుతూ యావత్ భారతదేశానికి తలమానికమైన తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దిగజార్చే విధంగా వ్యవహరిస్తూ పవిత్రమైన శ్రీవారు లడ్డు ప్రసాదాల తయారీలో అవకతవకలకు పాల్పడి హిందువుల మనోభావాలను గంగపాలు చేశారని మండిపడ్డారు. అనంతరం కడారి శ్రీనివాసు ఆధ్వర్యంలో జనసేన పార్టీ వీర మహిళలు, జన సైనికులు, పార్టీ అభిమానులు కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలుపుతూ, రాష్ట్ర వైసీపీ నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని, తిరుమల తిరుపతి దేవస్థానం లాంటి హిందూ ధార్మిక సంఘాల వ్యవస్థలలో ఎటువంటి అపవిత్రతకు వైసీపీ నేతలకు అవకాశం ఇవ్వొద్దని శ్రీవారిని కోరుకుంటూ శ్రీనివాసుని గోవింద నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జన సైనికులు, వీర మహిళలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెరవలి,మేజర్న్యూస్ : ముక్కామల గ్రామానికి చెందిన ఒక వివాహిత తన ఇద్దరు పిల్లలతో పుట్టిల్లు అయిన అజ్జరం వెళ్తున్నానని చెప్పి తర్వాత కనిపించకపోవడంపై ఆమె భర్త జానకి రాముడు పెరవలి పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీనిపై పెరవలి పోలీసులు కేసు నమోదు చేశారు. పెరవలి ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలు ప్రకారం అజ్జరం గ్రామానికి చెందిన రాణికి ముక్కామల చెందిన వనచర్ల జానకి రాముడుతో వివాహం కాగా వీరికి చంద్రిక అనే నాలుగు సంవత్సరాల అమ్మాయి వాసంతి లక్ష్మి అనే 17 నెలల అమ్మాయి ఉన్నారని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 28వ తేదీ శనివారం వనచర్ల రాణి తన పిల్లల్ని తీసుకుని అజ్జరం గ్రామంలో ఉన్న పుట్టింటికి వెళ్తున్నానని చెప్పి ఎక్కడికి వెళ్లిందో తెలియడం లేదని ఆమె భర్త జానకి రాముడు పెరవలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి అప్పారావు తెలియజేశారు. వీరి ఆచూకీ తెలిసినవారు పెరవలి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పంచాయతీ ఇన్చార్జ్‌గా కనిగిరి దుర్గా ప్రసాద్

రాజవొమ్మంగి, మేజర్న్యూస్ : రాజవొమ్మంగి పంచాయతీ ఇంచార్జ్ గా వైసిపి నేత దూసర పాము మాజీ సర్పంచ్ కనిగిరి దుర్గా ప్రసాద్‌ను నియమించినట్లు వైసిపి మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు.

ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ ఆదేశాల మేరకు గత ఐదు సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందిస్తున్న దుర్గా ప్రసాదును ఎంపిక చేయడం అయిందన్నారు. ఈ మేరకు దుర్గా ప్రసాదుకు వైసిపి నేతలు అభినందనలు తెలియజేశారు. పార్టీలో కష్టపడి పని చేసి సేవల అందించినందుకుగాను గుర్తించి తమకు ఈ బాధ్యత అప్పగించినందుకు ఎమ్మెల్సీ అనంతబాబు, ఎక్స్ ఎమ్మెల్యే ధనలక్ష్మి, సింగిరెడ్డి రామకృష్ణలకు దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కుసరాజు, వెంకటేశ్వరరాజు,మురళీకృష్ణ ఉన్నారు.

పేద ప్రజల బ్యాంక్ ఆర్యపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్

- పేదల పక్షాన నిలవాలని మంత్రి కందుల దుర్గేష్ సూచన

- ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని హామీ

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పేద ప్రజల బ్యాంక్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరంలోని వీటీ డిగ్రీ కాలేజ్ నందు ఆర్యపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 105వ సాధారణ మహాజన సభ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఒకానొక దశలో ఆర్యపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రగతి కుంటుపడిపోతుందన్న భయం అందరిలో ఉన్న సమయంలో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంబంధిత బ్యాంక్ పాలకులు అభివృద్ధిని సాధించేలా పట్టాలెక్కించారన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎంతో అనుభవం ఉన్న చైర్మన్ చల్లా శంకర్రావు నేతృత్వంలో, ఇతర డైరెక్టర్ల సారథ్యంలో పేద ప్రజలకు లోన్ లు ఇవ్వడం, బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించడంలో సఫలీకృతులయ్యారని మంత్రి తెలిపారు. రాజకీయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన చల్లా శంకర్రావు తన తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నారన్నారు ఆర్యపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అద్భుతమైన ప్రగతి సాధించాలని, పేదల పక్షాన నిలిచి నెంబర్ 1 బ్యాంకుగా కీర్తి ప్రతిష్టలు గడించాలని మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. ప్రస్తుతం అర్బన్ బ్యాంక్ సరైన పాలకవర్గం చేతిలో ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్యపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆర్యపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, వైస్ చైర్మన్ పరమేష్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం

పెద్దాపురం,మేజర్న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం మరియు బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాద శర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం ఆర్డీఓగా కె.శ్రీరమణి బాధ్యతలు స్వీకరణ

పెద్దాపురం రూరల్,మేజర్న్యూస్ : పెద్దాపురం ఆర్డీఓగా కె.శ్రీరమణి ఆదివారం మధ్యాహ్నం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటివరకు కాకినాడ జిల్లా డి.ఆర్.డి.ఏ. పి.డి.గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా పెద్దాపురం ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీరమణిని కార్యాలయ ఏఓ మాధవరావు, డిప్యూటి తహశీల్దార్ ఎం.వి.భానుకుమార్, దయానందరాజు, ఆనంద్, రమేష్ కుమార్, పలువురు సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించిన వారిలో ఉన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్డీఓగా విధులు నిర్వహించిన జె.సీతారామారావు రాష్ట్ర హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయనున్నారు.

ఎస్ఐగా సాదిక్ బాధ్యతలు స్వీకారం

రంపచోడవరం, మేజర్న్యూస్ : రంపచోడవరం నూతన ఎస్సైగా ఎస్.కె.సాదిక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రంపచోడవరం ఎస్ఐగా పని చేసిన మోహన్ కుమార్ గొల్లపాలెం ఎస్సైగా బదిలీ అయ్యారు. కాగా రంపచోడవరం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎస్ఐ సాధిక్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తొలుత నూతన ఎస్సై సాదిక్ కు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

సర్వతోముఖ విజ్ఞాన వికాసానికి పుస్తక పఠనంతోనే సాధ్యం

కాకినాడ,మేజర్‌న్యూస్ : బాలబాలికలు పుస్తక పఠనం చేయడం ద్వారానే సర్వతోముఖ విజ్ఞానాన్ని సాధించగలరని, పుస్తకములు విజ్ఞాన ద్వారాలని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాస రావు అన్నారు. కాకినాడ గాంధీనగర్ శాఖ గ్రంథాల యంలో ప్రతి ఆదివారం నిర్వహించే 'చదవటం మాకిష్టం' కార్యక్రమ ములో భాగముగా ఆదివారం నాడు హాజరైన విద్యార్థులతో బాలసాహిత్యం పుస్తకములను చదివించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు గురు శిష్యుల కథలు, నాయనమ్మ కథలు, బుద్ధొచ్చిన ఏనుగు తదితర కథలను చదవడం జరిగింది.

నర్సింగ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి

కాకినాడ, మేజర్ న్యూస్ : ఏపీ నర్సింగ్ అసోసియేషన్ సంఘ ఎన్నికల గురించి ఆదివారం ఎన్జీవో హోం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుల గుద్దటి రామామోహనరావు, జిల్లా కార్యదర్శి పి.వెంకటకృష్ణ కార్యదర్శి మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్‌ని కలసి నర్సింగ్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుట గురించి చర్చించి ఏపీ ఎన్జీ జీవో అసోసియేషన్ యొక్క సహాయ సహకారాలు కావాలని కోరారు. ఈ సమావేశంలో సహా అధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ళ చంద్రరావు, జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి,సంయుక్త కార్యదర్శి ఎన్.ఎం.కే.జి.ప్రసాద్, కాకినాడ యూనిట్ అధ్యక్షులు ఏ.సత్తిరాజు, సంయుక్త కార్యదర్శి(మహిళా) బి.వెంకటలక్ష్మి, మహిళ విభాగం చైర్ పర్సన్ బి.సుజాత, కో ఛైర్పర్సన్ ఎస్.వి.భారతి మరియు స్టాఫ్ నర్సెస్ పాల్గొన్నారు.

బాబోయ్ సర్పవరం..!

- మేము పని చేయం..!
- దేవునిపై గ్రామ రాజకీయం..!
- హడలిపోతున్న ఈఓలు
- పట్టించుకోని అధికారులు
- భావన్నారాయణ స్వామికీ తప్పని తిప్పలు
- ఓపక్క ఇంటిలిజెన్స్ ఆరా..!
- మరోపక్క ఎన్ఆర్ఈజిఎస్ చేతివాటం
- కష్టాల్లో ఈఓ,సిబ్బంది

కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి : భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఆ ఆలయంలో ముగ్గురు మూర్తులు కొలువుదీరారు. ఒకే దేవుడు మూడు రూపాల్లో ఉన్నాడు. దేశంలోనే ఆ అలయనికో వైశిష్ట్యం ఉంది. అంతటి మహిమాన్వితమైన ఆలయాన్ని దేవాదాయశాఖ అన్నతాధికారులు పట్టించుకోరు. ఇటువైపు తొంగి చూడరు. ఇక గ్రామంలో రెండు వర్గాలు. ఆ రెండు వర్గాలు ఆలయం మీదే ఫోకస్ చేస్తాయి. ఈఓ, సిబ్బంది నలిగిపోతున్నారు. ఉన్నతాధికారులు దీనిని సర్దిచెప్పడం మాని విచారణలు అంటూ వేధిస్తారు. దీంతో ఈ ఆలయంలో ఈఓగా పని చేసేందుకు ఎవరు రావడం లేదు. వచ్చినా కొందరు సెలవుపై వెళ్ళిపోతున్నారు. మరికొందరు బలవంతంగా బదిలీలు చేయించుకుని వెళ్ళిపోతున్నారు. దేవుడు ప్రతిష్ట మంట కలుస్తోంది. అయినప్పటికీ దీనిపై అధికారులు దృష్టి సారించడం లేదు. పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులదే హవా. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రైవేటు వ్యక్తులే పెత్తనం చేస్తారు. వారిని కాదంటే ఈఓ, సిబ్బందిపై ఫిర్యాదులు పెడతారు. దీంతో వారు కళ్ళప్పగించి చూడాలి. ఏదైనా జరిగితే మాత్రం ఈవర్గాలు సహకరించవు. ఈఓ పై నెపం వేసేస్తారు. ఇంతటి భయంకరమైన రాజకీయం రాష్ట్రంలో ఎక్కడా లేదని ఆ శాఖ అధికారులే అంగీకరిస్తున్నారు.

కాకినాడ జిల్లా కాకినాడరూరల్‌సర్పవరంశ్రీ భావన్నారాయణ స్వామివారి ఆలయం ఉంది. ఆ గ్రామానికి ఈ స్వామివారి వల్లే ఈ పేరు వచ్చింది. నారద మహర్షి గర్వభంగంతో విర్రవీగుతున్నప్పుడు విష్ణువు ఆయనను శపించాడు. మానవలోకంలోకి వెళ్లి జీవించాలని ఆదేశించాడు. దీంతో నారదుడు మహిళగా మరి ఈ ప్రాంతంలో తిరుగుతూ, అన్నిరకాల అప్పచేష్టలు చేశాడు. చివరికి శాపవిమోచనం కోసం తన తప్పు తెలుసుకుని ప్రస్తుతం ఏదైతే భావన్నారాయణ స్వామి ఆలయం ఉందోఅక్కడతపస్సు చేయగా విష్ణుమూర్తి ప్రత్యక్షమవుతాడు. తప్పు క్షమించమని నారదుడు కొరతాడు.దాంతో పక్కనే ఉన్న కొలనులో స్నానం చేయమని స్వామివారు ఆదేశిస్తారు. స్నానం చేసిన వెంటనే ఒక చెయ్యి తప్ప మిగిలిన భాగమంతా తిరిగి నారదునిగా మారిపోతుంది. శాపాన్ని, గర్వాన్ని గుర్తు చేసేందుకు ఆచెయ్యి మాత్రం స్త్రీ రూపంలో ఉంటుందని స్వామి చెబుతారు.దాంతో నారుదుడు తప్పు క్షమించమని మరోసారి కోరి ఇక్కడ కొలువుతీరాలని,ఈ లోకం లో పాపం పెరిగిపోయింది, భక్తుల పాపాలు తీర్చాలని కోరుతాడు. నీవు కళ్ళు మూసుకుని ఏ భావంతో నన్ను చూస్తావో అదే రూపంలో వెలుస్తానని స్వామివారు వరంఇస్తారు.నారదుడు భావంలో కనిపించిన స్వామిగా ఇక్కడ భావన్నారాయణస్వామి వెలిసారు.స్వామివారు ప్రత్యక్షంగా వెలిసిన మూలవిరాట్టు పాతాళ భవన్నారాయణుడిగా ఉంది. అదేవిధంగా నారద మహర్షి తనకు శాప విమోచనమైన వెంటనే మరో భావనారాయణస్వామివారిని ప్రతిష్టించారు. అలాగే ఓ సర్పానికి స్వామివారు వరం ఇస్తారు. దాంతో ఆ సర్పరాజు స్వామిని పర్సతిష్టించారు. సర్పానికి వరం ఇచ్చారు కాబట్టి ఈ ప్రాంతం సర్పవరం అయింది. ఇలా ముగ్గురు మూర్తులు కొలువు తీరారు. మాఘమాసం నెల రోజులు జాతరే. ఈ మాఘమాసంలో వచ్చే ఆదివారం అయితే కన్నుల పండుగ. లక్ష మంది వరకు భక్తులు వస్తారు. నెలరోజులు ఇక్కడే స్వామివారికి పొంగళ్ళు ఒండి నివేదన పెడతారు. ఇది ఆలయ చరిత్ర.

ఇక గ్రామంలో ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఈ ఆలయంపై పెత్తనం కోసం పోటీ పడతారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉండే నాయకులు ఇక్కడ పెత్తనం చేస్తారు. ఆలయంలో ప్రతి పని ఆ పార్టీకి చెందినవారు చేస్తారు. వారే ఆలయంలో ఓ కార్యాలయం ఏర్పాటు చేసుకుని భక్తులు, దాతల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. వారే అన్నదానం నిర్వహిస్తారు. కళ్యాణం, ఇతర ఉత్సవాలు అన్ని వారే నిర్వహిస్తారు. కమిటీ ఉన్నా లేకపోయినా పెత్తనమంతా వారిదే. ఇలా పలు దఫాలు ఆలయంపై ఆరోపణలు వచ్చాయి. చైర్మన్‌గా పనిచేసినవారిపై ఆరోపణలు వచ్చాయి. చైర్మన్, ఈవో వర్గంలుగా ఎప్పుడూ ఇక్కడ రాజకీయ నేపథ్యమే ఉంటుంది. కొన్ని సంవత్సరాల వ్యవధిలోనే ఆరు మందిపైగా ఈఓలు మారిపోయారు. కొంతమంది సెలవుపై వెళ్ళిపోయారు. ఇటీవల కొత్తగా ఈవోను నియమించినా ఆయన విధుల్లో చేరలేదు. అంతటి రాజకీయాలు ఉన్నాయని చెబుతారు. అయితే గ్రామంలో సాధారణ భక్తులు, ప్రజలు, దాతలు ఈ ఆలయానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఆలయంలో అభివృద్ధి పనులన్నీ దాతల సహకారంతోనే జరిగాయి. కానీ గ్రామంలో కేవలం కొంతమంది చేసే రాజకీయంతో దేవుడి పరువు పోతోందని భక్తులు వాపోతున్నారు. గతంలో కాకినాడ రూరల్ ఎంపీపీగా పనిచేస్తున్న పుల్లా చందు ఇక్కడ ఆలయం తరపున ఓ గోశాల నిర్మించారు. అయితే భక్తులు ఇచ్చిన ఆవులు కంటే కూడా ఏదైతే పోలీసుల తనిఖీల్లో పట్టుకుంటారో ఆ ఆవులు ఎద్దులు, గిత్తలూ ఇక్కడ వదిలేస్తున్నారు. వీటికి లెక్కా పత్రం లేదు. అసలు ఎవరు వీటిని దానమిచ్చారు, ఇవి ఎక్కడినుంచి వచ్చాయి, ఎన్ని ఉన్నాయి అన్న రికార్డులు లేవు. ఎందుకంటే గతంలో ఈ గోశాలలో కూడా ప్రైవేట్ వ్యక్తులే పెత్తనం చేసేవారు. ఆలయానికి ఆదాయం తక్కువ. దీంతో గోవులను పోషించే స్తోమత లేదు. కొన్ని చనిపోయాయి. ఇలాంటి నేపథ్యంలో ఓ మాజీ చైర్మన్ ఆలయంలో గోవులు దత్తత ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో ఈఓ రీజనల్ జాయింట్ కమిషనర్ కు లేఖ రాశారు. ఆయన నుంచి ఇంకా అనుమతి రాలేదు. కానీ రాజకీయ ఒత్తిడిలు పెరిగిపోయాయి. రైతులు నేరుగా వీటిని తీసుకువెళ్లిపోయే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఎవరైతే ఆవులు, ఎద్దులు తీసుకెళ్లారో వారి నుంచి 20 రూపాయల స్టాంప్ పేపర్‌పై సంతకాలు పెట్టించుకుని దేవాదాయశాఖ ఆలయం తరపున ఎప్పుడు అడిగితే అప్పుడువాటినిఅప్పగిస్తామని రాసిచ్చి తీసుకువెళ్లారు. దీంతో ఆవులు అమ్మేసారని, ఆవులు మాయమయ్యాయని వార్తలు వచ్చాయి.కొన్నిచనిపోయాయి కూడా.ఇలాంటినేపథ్యంలో ఇంటెలిజెన్స్ విభాగం దీనిపై విచారణకు ఆదేశించింది. ఇంటెలిజెన్స్ డిఎస్‌పి, సీఐ పూర్తిస్థాయిలో విచారణ జరిపారు. రాజకీయ ఒత్తిడితో కొందరు బలవంతంగా ఆవులు తీసుకెళ్లారు. అయితే ఈఓ వారితో స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ రాయించుకున్నారు. వాటిని జాయింట్ కమిషనర్ కార్యాలయానికి పంపారు అని ఇంటిలిజెన్స్ విచారణలో తేరింది.

ఈ వివాదం జరుగుతుండగానే కాకినాడ రూరల్ ఉపాధి హామీ పథకం అధికారులు అత్యుత్సాహం చూపించారు. స్వామివారి రాజగోపురం ఎదురుగా నారదుడుకి శాప విమోచనం కలిగిన ముక్తి గుండం ఉంది. ఇప్పటికీ అక్కడ నారద మహర్షి విగ్రహం ఉంటుంది. ఇక్కడ సహజసిద్ధంగా పెరిగిన చేపలను మాత్రమే పట్టుకునేందుకు బహిరంగ వేలం పెడతారు. అయితే ఉపాధి హామీ పథకం అధికారులు దేవాదాయ శాఖకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా కూలీలకు పని కల్పిస్తున్నామని చెప్పి ఆదివారం తెల్లవారుజామున పూర్తిగా చెరువు శుభ్రం చేశారు. నీరు బయటకు వచ్చింది. దీంతో కొన్ని చేపలు దొరికాయి. ప్రైవేట్ వ్యక్తులు అక్కడ చేరి వాటిని అమ్మేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వాస్తవానికి ఉపాధి హామీ పథకం అధికారులు ఈ చెరువులో పనిచేసినప్పుడు ఖచ్చితంగా ఆలయ ఈఓ సిబ్బందికి తెలియజేయాలి. వారు అక్కడ ఉండేవారు. చేపల విషయంలో ఉన్నతాధికారులకు తెలియజేసి నిర్ణయం తీసుకునేవారు. ముందుగానే సమాచారం ఇవ్వాలి. కానీ తెల్లవారుజామునొచ్చి పనులు చేసేసారు. చేపలు బయటికి వెళ్లిపోయాయి. ఈఓ చేపలు అమ్మేసారంటూ మళ్లీ ఆరోపణలు మొదలయ్యాయి. ఓ వర్గం ఈఓకు అనుకూలంగా, మరో వర్గం వ్యతిరేకంగా తయారయింది. కొందరు దళారులు ప్రవేశించారు. ఆవుల గురించి, చేపల గురించి రాయ 'బేరాలు' మొదలుపెట్టారు. దీనిపై సమాచారం తెలిసిన వెంటనే దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషన్ డి.ఎల్.వి. రమేష్ బాబు కూడా స్పందించారు. కాకినాడ డివిజన్ ఇన్స్పెక్టర్ వడ్డి ఫణింద్ర కుమార్ విచారణ జరిపారు. ఉపాధి హామీ పథకం అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చెరువు శుభ్రం చేయడంతో చేపలు బయటకొచ్చి ప్రయివేట్ వ్యక్తులు తీసుకువెళ్లినట్లు తేలింది. ఈ వ్యవహారంతో దేవాదాయ శాఖ ఆలయ అధికారులు, సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని ఈఓ, సిబ్బంది వివరణ ఇచ్చారు. అదేవిధంగా ఆవుల మాయం విషయంపై కూడా అఫిడవిట్లను అందజేశారు.ఇక్కడఈఓగావచ్చిమూడుసంవత్సరాలు పూర్తికాకముందే ఈఓ బలవంతంగా బదిలీ చేయించుకు వెళ్ళిపోయారు. అయినా రాజకీయాలు తప్పడం లేదు.

ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి ఆలయంపై ప్రైవేటు పెత్తనం తొలగించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండాచర్యలుతీసుకుంటే తప్పతాము పనిచేయలేమని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ట్రస్ట్ బోర్డులు నియమించినప్పటికీ పూర్తిగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలోనే ఉత్సావాలు, అన్నదానం జరిపేలా కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం జరిగినంత కాలం తమను తప్పుపట్ట వద్దని, దీనిపై ఉన్నతాధికారులే బాధ్యత వహించాలని దేవాదాయ ఉద్యోగుల సంఘం కూడా సూచిస్తోంది.

ఆర్.జె.సి.సూచనలు

– మాచిరాజు పర్యవేక్షణ

కాకినాడ రూరల్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సర్పవరం శ్రీ భావన్నారాయణస్వామి ఆలయంలో జరుగుతున్న వివాదాలు దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కే.సుబ్బారావు దృష్టికి వెళ్లాయి. దీంతో ఆయన ఈ ఆలయ నూతన ఈఓ గా నియమితుడైన మాచిరాజు లక్ష్మీనారాయణను ఆలయానికి వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం ఈఓ మాచిరాజు ఆలయాన్ని సందర్శించారు. గోవులు, చేపల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆవులు తీసుకున్నవారు ఇచ్చిన అఫిడవిట్లుపరిశీలించారు.అలాగే ఆదివారం ఉదయం చెరువును ఉపాధి హామీపథకంలో శుభ్రం చేసిన విషయం గుర్తించారు.

ఏపీ ఎంఎఫ్ కాకినాడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెడ్డిపల్లి రాజేష్

– మహిళ కార్యదర్శిగా పెద్దిరెడ్డి నందిని – ఎన్నిక ఏకగ్రీవం

కాకినాడ,మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లోజిల్లా అధ్యక్షుడు వి.దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి వీధి సాయినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి, ఉపాధ్యక్షుడు ఐవి రామరాజు, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) ఉపాధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఏపీఎంఎఫ్ బలమైనదని పాత్రికేయులకు ఏ ఇబ్బంది వచ్చినా ముందుండి వారికి అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తామని అన్నారు.అనంతరం యూనియన్ బలోపేతం దిశగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకినాడ ఐన్యూస్ స్టాఫ్ రిపోర్టర్ రెడ్డిపల్లి రాజేష్, మహిళ కార్యదర్శిగా బిఆర్‌కె స్టాఫ్ రిపోర్టర్ పెద్దిరెడ్డి నందిని లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో పనిచేస్తూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా జిల్లా జర్నలిస్టుల సమస్యలపై ఏపీఎంఎఫ్ నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షులు దుర్గారావు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు,హెల్త్ ఇన్సూరెన్స్, జర్నలిస్ట్ పిల్లలకు విద్యారాయితీల కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి టీవీ5 సుధాకర్, వైస్ ప్రెసిడెంట్లు టీవీ9 రామకృష్ణ, వార్త పల్లంరాజు, మహాటీవీ నాగేశ్వరరావు, ప్రైమ్ నైన్ కృష్ణ, ఐ న్యూస్ లోవరాజు, మహా టీవీ సూర్య, దాసు, చందు, రాజ్ న్యూస్ చింటూ, ఐ న్యూస్ రూరల్ రిపోర్టర్ ఎస్ లక్ష్మణరావు, వైఎన్‌సి ఛానల్ గణపతి, ఎన్ 99 సుబ్బు, సాక్షి దొరబాబు, రూరల్ సిటీకేబుల్ రిపోర్టర్ బి.వి. భాస్కర్ మరియు పలు నియోజకవర్గాల ఇంచార్జ్‌లు,కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారుల జీవితాలను నాశనం చేస్తున్నారు

– జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కనకాల

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : ఏపీలో బాస్కెట్‌బాల్ క్రీడను బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ అధ్యక్షుడు టీ చెంగల్రాయుడు, జనరల్ సెక్రటరీ గన్నమని చక్రవర్తిలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సర్వనాశనం చేయటమే కాకుండా అర్హులైన యువ క్రీడాకారుల జీవితాలను నాశనం చేస్తున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకాల వెంకటేశ్వరరావు ఆరోపించారు. పట్టణంలోని రాజగోపాల్ మినీ పంక్షన్ హాల్ నందు ఆదివారం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యాక్షులు ఎం సత్యనారాయణ, కె.పురుషోత్తమరావు, గుబ్బల రాజు, పుప్పాల వెంకటరమణ, కోశాధికారి ఎన్‌వివి శ్రీనివాస్‌లతో కలిసి అధ్యక్షులు వెంకటేశ్వరరావు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్‌ఏపీ పెద్దలు తమ ఇష్టారాజ్యంగా మార్చుకుని తీసుకున్న నిర్ణయాల మూలంగా అన్ని జిల్లాల్లోను అసోసియేషన్స్ రెండుగా చీలిపోయాయన్నారు.ఏపీకి చెందిన అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడాకారులు సైతం రాష్ట్ర అసోసియేషన్‌పై తిగుబాటు ఎగరవేశారన్నారు. చెంగల్రాయుడు, చక్రవర్తిలు ఇద్దరు క్రీడాకారుల బర్త్ సర్టిఫికెట్లను నకిలీ ధృవీకరణ పత్రాలను తయారు చేసి అర్హతలేని క్రీడాకారులను తీసుకువచ్చారన్నారు. రామచంద్రపురం మండలం వెల్ల, తాళ్లపొలం గ్రామ సచివాలయాల అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ ధృవీకరణ పత్రాలతో 17 మంది క్రీడాకారులకు అన్యాం చేశారన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా అవి నకిలీ సర్టిఫికెట్లుగా అధికారులు ధృవీకరించారని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ విషయంపై స్పోర్ట్ అథార్టి ఆఫ్ ఏపీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులకు 2019 నుంచి 2020 వరకు నాలుగుసార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో జరుగుతన్న అన్యాయాలపై 2021లో హైకోర్టును ఆశ్రయించగా 20 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు.

2022 డిసెంబర్ 9వ తేదీ నుంచి 2022 డిసెంబర్ 12వ తేదీ వరకు కేరళ రాష్ట్రం కాలికట్‌లో జరిగిన 72వ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలోను, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అమలాపురంలో జరిగిన అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లోను క్రీడాకారులు ఏవిధంగా నష్టపోయారనే దానిపై వెంకటేశ్వరరావు వివరించారు.

ఈ పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ద్వారా విడుదల చేసిన రూ.1,25,000లను జనరల్ సెక్రటరీ తన సొంత అవసరాలకు వాడుకుని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు అందించకుండా మభ్యపెట్టర న్నారు. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ అంధ్రప్రదేశ్ గుర్తింపులేని అసోసియేషన్స్ ద్వారా జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేక్రీడాకారుల సర్టిఫికెట్స్ ఏవిధమైన స్పోర్ట్స కోటాకి వర్తించవన్నారు. ఎన్నో ఆశలతో తమ ఉజ్వల భవిష్యత్ కోసం ఎంతో కష్టపడి టోర్నమెంట్స్ ఆడిన క్రీడకారులకు స్పోర్ట్స్ కోటా లేకపోవడానికి ప్రధాన కారణమైన అధ్యక్షుడు చెంగల్రాయుడు, చక్రవర్తిలను తమ దగ్గర ఉన్న సాక్ష్యాధారాలతో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి వ్యవసాయ సంక్షోభం సదస్సులో ప్రసంగిస్తున్న గాంధీ బాబు

కూనవరం,మేజర్‌న్యూస్ : తెలంగాణ, మహారాష్ట్ర మరియు పంజాబ్ మూడు రాష్ట్రాల వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థాగత హింస అనే అంశంపై ఒక స్టడీని రెండు రోజులు అనగాది.27.09.2024 మరియు 28.09.2024, ఉస్మానియా యునివర్సిటి, హైదరాబాద్ నందు జరిగింది. ఈ సమావేశం నందు వ్యవసాయక మరియు సాంఘిక అభివృద్ధి సంస్థ (ఏ.ఎస్.డి.ఎస్), రేఖపల్లి, వి.ఆర్.పురం మండలం, వ్యవస్థాపక అధినేత శ్రీ ఉండవల్లి గాంధిబాబు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతములలో సమస్యలు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, మానవ తప్పిదాల వలన విప్పత్తులు గురించి మాట్లాడారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతంలో వ్యవసాయ కేలండర్ మారిపోయినదని, సరైన సమయంలో విత్తనాలు వేయలేక, వేసిన పంటలకు సరైన సమయంలో వర్షాలు లేకపోవడంతో దిగుబడి తగ్గడం వలన రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక వర్షాలు వలన నదుల మరియు వాగుల వరదల వలన రవాణా సౌకర్యం లేకపోవడము, వ్యవసాయ పనులు లేకపోవడము వంటి కారణాల వలన వ్యవసాయ కూలీలు అనేక ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో మహిళలపై ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, పిల్ల తల్లులు, కిశోర బాలికలు పోషకారాన్ని కోల్పోతున్నారు. తల్లీపిల్లల మరణాలు, మాల్ న్యూట్రిషన్ శాతం పెరగడం వలన అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవి అన్నిటికి మూలంగా మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ విషయాలపై ఒక సమగ్ర స్టడీ జరగాలని సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమములో మూడు రాష్ట్రముల నుండి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు